స్వామివారికి ఆదాయం ఘనం.. అమ్మవారి ఖర్చు అధికం

- యాదగిరిగుట్ట దేవస్థాన ప్రధాన పురోహితుడు సత్యనారాయణశర్మ

పంచాంగ పఠనంలో పాల్గొన్న కలెక్టర్ హనుమంతరావు, ఆలయ అధికారులు

యాదగిరిగుట్ట, మార్చి 30 : విశ్వావసు నామ సంవత్సరంలో యాదగిరిగుట్ట లక్ష్మీనరసింహస్వామికి ఆదాయం గణనీయంగా పెరిగే అవకాశం కనిపిస్తుందని దేవస్థాన ప్రధాన పురోహితుడు గౌరీభట్ల సత్యనారాయణశర్మ తెలిపారు. స్వామివారిది స్వాతి నక్షత్రం, తులారాశి కావడంతో విశ్వావసు నామ సంవత్సరంలో 11 ఆదాయం, 05 వ్యయంగా ఉందన్నారు. ఆండాళ్ అమ్మవారిది పుబ్బా నక్షత్రం, సింహరాశి కావడంతో 11 ఆదాయం, 11 వ్యయంగా ఉందన్నారు. ఆదివారం ఉగాది పర్వదినాన్ని పురస్కరించుకుని యాదగిరిగుట్ట ప్రధానాలయంలో స్వామి, అమ్మవార్లను దివ్య మనోహరంగా అలంకరించి తిరుమాఢ వీధుల్లో సేవను ఊరేగించారు. తూర్పు మాఢవీధుల్లో పంచాంగ శ్రవణం నిర్వహించారు. ఆదాయం ఎక్కువగా ఉండి, ఖర్చు తక్కువగా ఉండటంతో స్వామివారి ఆదాయం ఈ ఏడాది గణనీయంగా పెరిగే అవకాశం ఉందన్నారు. ఈ ఏడాది బరించలేని వేసవి తాపంతోపాటు వడగాల్పులతో కూడిన శిలా వర్షపాతం కురిసే అవకాశం ఉందని చెప్పారు. గ్రీష్మ రుతువుతో కూడిన జ్యేష్ఠ, ఆషాఢ మాసాల్లో ఉష్ణోగ్రతలు తీవ్రంగా ఉంటాయన్నారు. వీటితోపాటు సస్యానుకూల వర్షపాత సూచనలు ఉన్నాయని, శ్రావణ, బాద్రపద రుతువుల్లో చక్కటి వర్షపాతాలతో జలాశయాలు నిండి నదులు పరిపూర్ణంగా ప్రవహిస్తాయని చెప్పారు. అశ్వయుజ, కార్తిక మాసాల్లో అక్కడక్కడ తుఫాను వర్షాలు, రోగ భయాలు సంభవించడంతోపాటు ధాన్యాల ధరలు పెరిగే అవకాశం ఉందన్నారు. మార్గశిర, పుష్య మాసాల్లో భూకంపాలు, ఉపద్రవాలు ఏర్పడి వివిధ ఖనిజ నిక్షేపాల ధరల్లో అనిశ్చితి ఏర్పడుతుందన్నారు. మాఘ, ఫాల్గుణ మాసాల్లో సకల ధాన్యాదులు, రస, క్షీరస, వస్తు సముదాయాల ధరల పెరుగుదల ఉన్నా జన జీవన శైలికి ఎలాంటి అవరోధం ఉండదని తెలిపారు.

కార్యక్రమంలో కలెక్టర్ హనుమంతరావు, ఆలయ అనువంశిక ధర్మకర్త. బి.నరసింహమూర్తి, ఈఓ భాస్కర్‌రావు, డీఈఓ దోర్బాల భాస్కర్‌శర్మ, ప్రధానార్చకులు నల్లన్‌థిఘన్ లక్ష్మీనరసింహాచార్యులు, కాండూరి వేంకటాచార్యులు, ఆలయ అర్చకులు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

తిరుమలనాథ స్వామి ఆలయ అభివృద్ధికి సహకరిస్తా

- కలెక్టర్ హనుమంతరావు

బొమ్మలరామారం, మార్చి 30 : తిరుమలనాథ స్వామి ఆలయ అభివృద్ధికి సహకారం అందిస్తానని కలెక్టర్ హనుమంతరావు అన్నారు. మండలంలోని చీకటిమామిడి గ్రామంలో భూదేవి, శ్రీదేవి సహిత తిరుమలనాథ స్వామి బ్రహ్మోత్సవాల ముగింపు సందర్భంగా ఆదివారం కలెక్టర్ స్వామివారిని దర్శించుకున్నారు. ఆయనకు ఆలయ పాలకమండలి సభ్యులు పూర్ణకుంభంతో స్వాగతం పలికారు. కార్యక్రమంలో ఆలయ చైర్మన్ రాగుల బలరాం, మాజీ సర్పంచ్ మచ్చ శ్రీనివాస్, మాజీ ఎంపీటీసీ గొడుగు చంద్రమౌళి, అమరేందర్, లక్ష్మీనరసింహాచార్యులు పాల్గొన్నారు.

రంజాన్ పండుగను ప్రశాంతంగా జరుపుకోవాలి

- డీసీపీ అక్షాంశ్ యాదవ్

భువనగిరి అర్బన్, మార్చి 30 : ముస్లింలు రంజాన్ పండుగను ప్రశాంతంగా జరుపుకోవాలని డీసీపీ అక్షాంశ్ యాదవ్ అన్నారు. మత సామరస్యం కోసం యాదాద్రి జోన్ పోలీస్ అధికారులు పలు జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. రంజాన్ పండుగ సందర్భంగా అవాంఛనీయ ఘటనలు జరుగకుండా ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నట్లు చెప్పారు. అన్ని మసీదుల ప్రాంగణాల్లో వాహనాల నెంబర్ ప్లేట్ల చెకింగ్, పత్రాల చెకింగ్ నిర్వహించాలని పోలీసు అధికారులను ఆదేశించారు. అవసరమైన ప్రదేశాల్లో బాంబు తనిఖీ బృందాల ద్వారా ముందస్తు తనిఖీలు చేపట్టాలన్నారు. డీసీపీ ఆదేశాల మేరకు భువనగిరి పట్టణ పోలీస్ స్టేషన్ పరిధిలోని మసీదులు, దర్గాలు, పట్టణంలో రద్దీ ఉన్న ప్రాంతాల్లో భువనగిరి పోలీసులు తనిఖీలు చేపట్టారు.

పాల్వంచకు రాష్ట్ర స్థాయి పురస్కారం

బహుమతి, ప్రశంసా పత్రం అందుకుంటున్న హరికిషన్

రామన్నపేట, మార్చి 30 : అక్షర కళాభారతి సాహిత్య, సాంస్కృతిక సంస్థ 31వ వార్షికోత్సవం ఉగాది సందర్భంగా చౌటుప్పల్ పట్టణంలో ఆదివారం కవితల పోటీలు నిర్వహించారు. ఈ సందర్భంగా 'నేల తల్లిని కాపాడుదాం.. సహజ వనరులను సంరక్షించుకుందాం' అంశంపై ఏర్పాటు చేసిన పద్య వచన కవితా పోటీల్లో రామన్నపేట మండల కేంద్రానికి చెందిన కవి, ఉపాధ్యాయుడు పాల్వంచ హరికిషన్ రాష్ట్ర స్థాయిలో 4వ బహుమతి గెలుచుకున్నారు. బాసర ఉప కులపతి అలివేరు గోవర్ధన్ చేతుల మీదుగా ప్రశంసా పత్రం, బహుమతిని అందుకున్నారు. అక్షర కళాభారతి సంస్థ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు మోటె సత్తయ్య, బడుగు శ్రీరాములు పాల్గొన్నారు.

మాదిగ మహాజన సంఘం నూతన కార్యవర్గం ఎన్నిక

లక్ష్మణ్ మాదిగ, నూతన అధ్యక్షుడు

భూదాన్ పోచంపల్లి, మార్చి 30 : పట్టణంలోని పోచమ్మ ఆలయ ప్రాంగణంలో మాదిగ మహాజన సంఘం నూతన కార్యవర్గాన్ని ఆదివారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా నల్ల లక్ష్మణ్ మాదిగ, గౌరవాధ్యక్షులుగా పోతగల దానయ్య, పెద్దల చక్రపాణి, గౌరవ సలహాదారులుగా కరగళ్ల కుమార్, ఎర్ర శంకర్, ఉపాధ్యక్షులుగా పోతగళ్ల మల్లేశ్, కొమ్ము ఊషయ్య, పెద్దల నాగేశ్, ప్రధాన కార్యదర్శిగా ఎర్ర భిక్షపతి, సహాయ కార్యదర్శులుగా కరగళ్ల శ్రీను, నల్ల లింగస్వామి, బాలేందర్, కోశాధికారిగా పోతగళ్ల బాబు, ప్రచార కార్యదర్శిగా ఎడ్ల లింగస్వామి, చెరుకు నరేశ్, కార్యవర్గ సభ్యులుగా రవి, యాదగిరి, దానయ్య, బాలస్వామి, నరేశ్, సందీప్ ఎన్నికయ్యారు.

భూదాన్ పోచంపల్లి : మార్కండేశ్వర స్వామి ఆలయంలో పంచాంగ పఠనం చేస్తున్న పురోహితులు



చౌటుప్పల్ : పంచాంగం వినిపిస్తున్న పురోహితుడు

ఘనంగా ఉగాది వేడుకలు

ఆలేరు రూరల్ : కొలనుపాకలో ఉగాది వేడుకలు జరుపుకొంటున్న గీత కార్మికులు

తుర్కపల్లి/ ఆలేరు రూరల్/ మోటకొండూర్/ ఆత్మకూరు(ఎం)/ చౌటుప్పల్/ చౌటుప్పల్ రూరల్/ బొమ్మలరామారం/ భువనగిరి కలెక్టరేట్/ భూదాన్ పోచంపల్లి, మార్చి 30 : తెలుగు నూతన సంవత్సరం ఉగాది పర్వదిన వేడుకలను ఆదివారం జిల్లా వ్యాప్తంగా ఘనంగా జరుపుకొన్నారు. ఉదయం ఇండ్లల్లో షడ్రుచులతో కూడిన ఉగాది పచ్చడి చేసి కుటుంబ సమేతంగా స్వీకరించారు. సాయంత్రం ఆలయాల్లో పురోహితులు పంచాంగ పఠనం నిర్వహించగా.. ప్రజలు ఆసక్తిగా విన్నారు. తుర్కపల్లి పోలీస్‌స్టేషన్‌లో ఎస్ఐ తకియుద్దీన్, పోలీసులు ఉగాది పచ్చడి చేసి స్వీకరించారు. ఆలేరు మండల వ్యాప్తంగా అన్ని గ్రామాల్లో సాంప్రదాయబద్ధంగా ఉగాది పండుగ జరుపుకొన్నారు. మోటకొండూర్ మండలంలో ఇండ్లను మామిడి తోరణాలతో అలకరించుకున్నారు. ఆలయాల్లో పురోహితులు పంచాంగం వినిపించి, రాశి ఫలాలను చెప్పారు. చౌటుప్పల్ పట్టణంలోని శ్రీబాలాజీ రామకృష్ణ దేవాలయంలో ఆలయ కమిటీ ఆధ్వర్యంలో ఉగాది వేడుకలు నిర్వహించారు. వేద పండితులు పూజలు నిర్వహించి పంచాంగ పఠనం చేసి ఉగాది పచ్చడి వితరణ చేశారు. భువనగిరి పట్టణ పరిధి రాయగిరిలో గౌడ కులస్తులు ఉగాది పచ్చడిని ఇంటింటికీ పంపిణీ చేశారు. భూదాన్ పోచంపల్లి పట్టణంలోని మార్కండేశ్వర, లక్ష్మీనారాయణ, భక్తాంజనేయ, మహమ్మాయిదేవి దేవాలయాలతోపాటు దేశ్‌ముఖిలోని సాయి బృందావనం, కనుముక్కుల గ్రామంలోని వేంకటేశ్వరస్వామి ఆలయాల్లో పంచాంగ పఠనం చేశారు.

దేవాలయాల్లో పంచాంగ పఠనం

భువనగిరి అర్బన్ : ఉగాది పండుగ సందర్భంగా పట్టణంలోని దేవాలయాల్లో ఆదివారం ఉదయం నుంచి పూజలు నిర్వహించగా.. భక్తులు దర్శించుకున్నారు. పట్టణంలోని పచ్చల కట్ట సోమేశ్వరాలయంలో విశ్వవసు నూతన సంవత్సర ఉగాది పర్వదినాన్ని పురస్కరించుకొని ఆలయ చైర్మన్ కొల్లూరి రాజు ఆధ్వర్యంలో పంచాంగ పఠనం, ఉగాది పచ్చడి వితరణ కార్యక్రమం నిర్వహించారు.

మోత్కూరు : పట్టణంలోని రామలింగేశ్వర స్వామి ఆలయంలో, ఎన్ఆర్ఐ కల్వల సుజిత్ కుమార్ నివాసంలో వేర్వేరుగా పంచాంగ శ్రవణం నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రముఖులకు షడ్రుచుల పచ్చడిని పంపిణీ చేశారు. పురోహితులు పారునంది సూరిబాబుశర్మ, రామలింగంశర్మ ఆధ్వర్యంలో పంచాంగ పఠనం చేశారు.

ఆత్మకూరు(ఎం) : కంఠమహేశ్వర సురమాంబ దేవాలయంలో ఉగాది వేడుకలు జరుపుకొంటున్న గీత కార్మికులు

చౌటుప్పల్ రూరల్ : శ్రీరామ కాశీవిశ్వేశ్వర దేవాలయంలో పంచాంగ పఠనంలో పాల్గొన్న వివిధ పార్టీల నాయకులు, పురోహితులు

భువనగిరి అర్బన్ : పంచాంగ పఠనం చేస్తున్న అర్చకుడు నాగరాజుశర్మ

తుర్కపల్లి పోలీస్‌స్టేషన్‌లో ఉగాది పచ్చడి స్వీకరిస్తున్న ఎస్ఐ తకియుద్దీన్

మోత్కూరులో ముత్యాలమ్మలకు బోనాలు

- ఎండ్లబండ్ల ప్రదర్శన
- వినూత్నంగా ఉగాది వేడుకలు

ఎడ్ల బండ్ల ప్రదర్శన

ముత్యాలమ్మకు ఊరేగింపుగా బోనాలు తీసుకెళ్తున్న మహిళలు

మోత్కూరు, మార్చి 30 : విశ్వావసు నామ సంవత్సరం ఉగాది పండుగ సంబురాలను మోత్కూరు పట్టణంలో ప్రజలు ఘనంగా జరుపుకొన్నారు. రాష్ట్రంలో ఎక్కడా జరుపుకోని విధంగా వినూత్నంగా తెలుగు నూతన సంవత్సరానికి స్వాగతం పలికారు. గ్రామస్తులంతా కుల, మతాలకతీతంగా బోనాలు, ఫలహారం బండ్లు ఏర్పాటు చేశారు. గ్రామ దేవత ముత్యాలమ్మలకు కొత్త కుండలో బెల్లం, చక్కెర, పాలు, పాయసంతో తయారు చేసిన నైవేద్యం సమర్పించారు. ఎడ్లబండ్లను శుభ్రం చేసి జాజు, సున్నం, వివిధ రంగులతో అలంకరణ చేసి వేప, మామిడి ఆకుల తోరణాలతో అలంకరించి పూజించారు. ఉదయం మహిళలు బోనాలతో తరలి వచ్చి అమ్మవార్లకు నైవేద్యం సమర్పించారు. మధ్యాహ్నం అమ్మవారి ఆలయాల చుట్టూ ఫలహారం బండ్లను తిప్పుతూ ప్రదర్శనలు చేశారు. పట్టణంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో ఎడ్లబండ్లు, బైక్‌లు, ట్రాక్టర్ల ప్రదర్శనలు నిర్వహించారు. చెరువు కట్ట సమీపంలోని ముత్యాలమ్మ ఆలయంలో కొలువుదీరిన అమ్మవారికి, సుందరయ్య కాలనీలోని పడమటి ముత్యాలమ్మ, కొండాపురం గ్రామంలోని ముత్యాలమ్మలకు బోనం సమర్పించారు. ఆలయాల చుట్టూ ఫలహారం బండ్లు, ట్రాక్టర్లు, కార్లు, బైక్‌లతో ప్రదక్షిణలు చేశారు. యువకులు బైక్‌ల విన్యాసాలు చేసి అలరించారు. ఎస్ఐ డి.నాగరాజు ఆధ్వర్యంలో పోలీసులు బందోబస్తు నిర్వహించారు.

చలివేంద్రం పారంభం

బీబీనగర్, మార్చి 30 : మండలంలోని గూడూరు టోల్‌ప్లాజా ఆవరణలో వరంగల్ – హైదరాబాద్ జాతీయ రహదారికి ఇరువైపులా గూడూరు నారాయణరెడ్డి ఫౌండేషన్ ఆధ్వర్యంలో చలివేంద్రాలను ఏర్పాటు చేశారు. వాటిని బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు గూడూరు నారాయణరెడ్డి ఆదివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రయాణికులకు వేసవిలో చల్లని మినరల్ వాటర్‌తో దాహాన్ని తీర్చడానికి చలివేంద్రాలను ఏర్పాటు చేస్తున్నామన్నారు. నాయకులు ప్రభాకర్, జంగారెడ్డి, నరోత్తంరెడ్డి, శ్రీకాంత్‌గౌడ్, శ్రీనివాస్‌రెడ్డి, సుభాశ్‌రెడ్డి, కృష్ణారెడ్డి, సుకేశ్‌రెడ్డి, సతీశ్, ఆంజనేయులు పాల్గొన్నారు.

ప్రసన్నాంజనేయ స్వామి ఆలయ హుండీ లెక్కింపు

చౌటుప్పల్, మార్చి 30 : మున్సిపాలిటీ పరిధిలోని లక్కారం ప్రసన్నాంజనేయ స్వామి దేవాలయంలో ఆదివారం హుండీ లెక్కించారు. సంవత్సరంలో భక్తుల కానుకల ద్వారా స్వామివారికి రూ.25,536 ఆదాయం లభించింది. కార్యక్రమంలో దేవాలయ అధ్యక్షుడు మునుకుంట్ల మల్లేశం గౌడ్, నాయకులు పాశం సంజయ్‌బాబు, ఆకుల ఇంద్రసేనారెడ్డి, దుబ్బాక శశిధర్‌రెడ్డి, కొయ్యడ సైదులు గౌడ్, ఆకాశ్‌రెడ్డి, భీమయ్య పాల్గొన్నారు.

గ్రూప్-1కు ఎంపికైన మహేశ్‌రెడ్డి

మోటకొండూర్, మార్చి 30 : మండలంలోని నాంచారిపేట గ్రామానికి చెందిన పైళ్ల విఠల్‌రెడ్డి – రమాదేవి దంపతుల కుమారుడు మహేశ్‌రెడ్డి గ్రూప్-1లో ఉత్తమ ప్రతిభ కనబరిచాడు. 497 మార్కులతో స్టేట్ 60వ ర్యాంక్ సాధించాడు. డీఎస్పీ ఉద్యోగం వస్తుందని భావిస్తున్నాడు. ప్రస్తుతం ఆయన సైబరాబాద్ క్రైమ్ సెక్యూరిటీ బ్యూరో ఎస్ఐగా విధులు నిర్వర్తిస్తున్నాడు. మహేశ్‌రెడ్డికి కుటుంబ సభ్యులు, గ్రామస్తులు అభినందనలు తెలిపారు.

ఇఫ్తార్ విందులతో ఆత్మీయత పెంపు

- డీసీసీబీ మాజీ చైర్మన్ గొంగిడి మహేందర్‌రెడ్డి

ముస్లింలతో కలిసి ఇఫ్తార్ విందులో పాల్గొన్న డీసీసీబీ మాజీ చైర్మన్ మహేందర్‌రెడ్డి

మోటకొండూర్, మార్చి 30 : పవిత్ర రంజాన్ మాసం మత సామరస్యానికి ప్రతీకగా నిలుస్తుందని, ముస్లింల కోసం ఏర్పాటు చేసే ఇఫ్తార్ విందులు ఆత్మీయతను పెంపొందిస్తాయని డీసీసీబీ మాజీ చైర్మన్ గొంగిడి మహేందర్‌రెడ్డి అన్నారు. మండలంలోని చాడ గ్రామానికి చెందిన బీఆర్ఎస్ నాయకులు మహమూద్, కంకటి నరేశ్ ఆదివారం ఏర్పాటు చేసిన ఇఫ్తార్ విందులో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ రంజాన్ పండుగను ముస్లింలు ప్రశాంతంగా జరుపుకోవాలన్నారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు మల్గ సిద్ధులు, పబ్బతి శ్రీధర్‌రెడ్డి, గుర్రాల మల్లయ్య, శ్రీనివాస్, ముస్త్యాల కృష్ణ, ముస్లిం పెద్దలు పాషా, యూసుఫ్, యూనిస్, బురాన్ పాల్గొన్నారు.

తిమ్మాపురంలో రంజాన్ కానుకల పంపిణీ

రంజాన్ కానుకలు పంపిణీ చేస్తున్న సత్తిరెడ్డి

భువనగిరి కలెక్టరేట్, మార్చి 30 : మండలంలోని బీఎన్ తిమ్మాపురం గ్రామంలో రంజాన్ పండుగ సందర్భంగా సింగిల్‌విండో మాజీ చైర్మన్ ఎడ్ల సత్తిరెడ్డి ఆదివారం ముస్లింలకు నూతన వస్త్రాలు, నిత్యావసర సరుకులు పంపిణీ చేశారు. ముస్లింలకు రంజాన్ శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ముస్లింలంతా రంజాన్ పండుగను ఆనందోత్సాహాలతో జరుపుకోవాలన్నారు. కార్యక్రమంలో మాజీ ఎంపీటీసీ ఉడుత శారదా ఆంజనేయులు, ఉపసర్పంచ్ ఎడ్ల దర్శన్‌రెడ్డి, బీఆర్ఎస్ గ్రామ శాఖ అధ్యక్షుడు ప్రభాకర్‌గౌడ్, నాయకులు నర్సింహ, బాలయ్య, అశోక్, పరమేశ్, మహేందర్, మైసయ్య, ఆంజనేయులు, చంద్రం, శేఖర్, అశోక్ పాల్గొన్నారు.

సమాజ చైతన్యం కోసం రచనలు చేయాలి

- తెలంగాణ రచయితల సంఘం జంట నగరాల అధ్యక్షుడు శ్రీరాములు

కవి సమ్మేళనంలో పుస్తకం ఆవిష్కరిస్తున్న కవులు

భూదాన్ పోచంపల్లి, మార్చి 30 : సమాజ చైతన్యం కోసం కవులు తన రచనలు కొనసాగించాలని తెలంగాణ రచయితల సంఘం జంట నగరాల అధ్యక్షుడు, ప్రముఖ కవి కందుకూరి శ్రీరాములు అన్నారు. పట్టణంలోని మార్కండేయ స్వామి దేవాలయం ఆవరణలో త్రివేణి సాహితీ సంఘం, కేవీటీ స్పోర్ట్స్ క్లబ్, కల్పనా ఫౌండేషన్ సంయుక్త ఆధ్వర్యంలో ఆదివారం ఉగాది కవి సమ్మేళనం, ఉగాది ప్రతిభా పురస్కారాల ప్రదానం కార్యక్రమం నిర్వహించారు. దీనికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. సమాజ వికాసానికి, దేశాభివృద్ధికి కవులు, సాహితీవేత్తలు కృషి చేయాలన్నారు. కవులు, వృత్తిలో ప్రతిభావంతులైన వారిని ప్రోత్సహించి సన్మానించడం అభినందనీయమని పేర్కొన్నారు. అనంతరం భారత వినోద్ (చేనేత రంగం), పుట్టపాక యాదయ్యగౌడ్ (కల్లు గీత వృత్తి), రచ్చ గణేశ్ (ఫొటోగ్రఫీ ఫొటో ఫ్రేమ్) తదితరులకు ఉగాది పురస్కారాలు అందజేశారు. వారిని శాలువాతో సత్కరించి ప్రశంసా పత్రాన్ని అందజేశారు. కవి సమ్మేళనంలో పాల్గొన్న కవులను సన్మానించారు. కార్యక్రమంలో ప్రముఖ కవులు బెల్లంకొండ సంపత్‌కుమార్, గుండెలి ఇస్తారి, దేవాలయ చైర్మన్ సీత సత్యనారాయణ, త్రివేణి సాహితీ సంఘం అధ్యక్ష, కార్యదర్శులు గుంటి దయానంద్, గజ్జెల రామకృష్ణ, వ్యవస్థాపక అధ్యక్షుడు తడక యాదగిరి, టై అండ్ డై అసోసియేషన్ అధ్యక్షుడు భారత లవకుమార్, మాజీ అధ్యక్షుడు పట్నం కృష్ణకుమార్, కేవీటీ స్పోర్ట్స్ క్లబ్ అధ్యక్షుడు కర్నాటి బాలసుబ్రమణ్యం పాల్గొన్నారు.

ఈద్గాల వద్ద ఏర్పాట్లు పూర్తి

భువనగిరిలో హైదరాబాద్ చౌరస్తా సమీపంలోని ఈద్గా వద్ద ప్రార్థనలకు ఏర్పాట్లు

భువనగిరి అర్బన్, మార్చి 30 : రంజాన్ పండుగ సందర్భంగా పట్టణంలోని ఈద్గాల వద్ద మున్సిపాలిటీ ఆధ్వర్యంలో అన్ని ఏర్పాట్లు చేశారు. ప్రార్థనల కోసం మౌలిక వసతులు కల్పించారు. ప్రార్థనలకు వచ్చే ముస్లింలకు తాగునీటి వసతి, విద్యుత్ లైట్లు ఏర్పాటు చేశారు. పండుగను ప్రశాంతంగా జరుపుకొనేందుకు పోలీలు భారీ బందోబస్తు నిర్వహిస్తున్నారు.

నత్తనడకన సాగుతున్న బ్రిడ్జి పనులు

- శివారెడ్డిగూడెం - రెడ్డినగర్ మధ్య బ్రిడ్జి నిర్మాణానికి నేటితో గడువు పూర్తి
- ఇంకా 50శాతం పనులు పెండింగ్

భూదాన్ పోచంపల్లి, మార్చి 30 : మండలంలోని శివారెడ్డిగూడెం – రెడ్డినగర్ (దంతూర్) గ్రామాల మధ్య చిన్నేరు వాగుపై నిర్మిస్తున్న బ్రిడ్జి పనులు నాలుగేండ్లుగా సాగుతున్నాయి. శిథిలావస్థకు చేరిన లో లేవల్ బ్రిడ్జి స్థానంలో వాగుపై హై లెవెల్ బ్రిడ్జి నిర్మించేందుకు 2021లో కేంద్ర ప్రభుత్వం ప్రధాన మంత్రి గ్రామ సడక్ యోజన పథకం కింద రూ.6.22 కోట్లు మంజూరు చేసింది. 2022 జనవరిలో నిర్మాణ పనులు ప్రారంభించారు. చిన్నేటి వాగుపై 153.23 మీటర్ల పొడవు, 10 పిల్లర్లతో 2023 సెప్టెంబర్‌లోగా బ్రిడ్జి పనులు పూర్తి చేసి అందుబాటులోకి తీసుకురావాలని నిర్ణయించారు. కానీ.. మూడేండ్లలో పది పిల్లర్లకు ఏడు పిల్లర్లు మాత్రమే పూర్తయ్యాయి. చేసిన పనులకు బిల్లులు రావడం లేదని సదరు కాంట్రాక్టర్ బ్రిడ్జి నిర్మాణ పనులను ఏడాదిపాటు నిలిపివేశారు. పనుల జాప్యం వల్ల 2023 సెప్టెంబర్‌తో ఆ గడువు ముగిసింది. ప్రభుత్వం మరోసారి ఈ ఏడాది మార్చి 31వరకు గడువు పొడిగించినా పనుల్లో చెప్పుకోదగ్గ పురోగతి లేదు. రెండోసారి ఇచ్చిన గడువు నేటితో ముగియనున్నది.

ధర్మారెడ్డిపల్లి, వంకమామిడి, రెడ్డిబాయి తదితర గ్రామాల ప్రజలు మండల కేంద్రానికి రావడానికి, ఇంద్రియాల, శివారెడ్డిగూడెం, పెద్దరావులపల్లి గ్రామాల ప్రజలు చౌటుప్పల్ వెళ్లడానికి ఇదే ప్రధాన మార్గం. దీంతో ఈ రహదారిలో నిత్యం వాహనాల రద్దీ ఉంటుంది. రైతులు తమ పొలాల వద్దకు ఇదే మార్గం గుండా వెళ్లాల్సి వస్తుంది. బ్రిడ్జి నిర్మాణ పనులు జరిగే వాగు వద్ద గుంతల దారి కనిపించక రాత్రి వేళలో ద్విచక్ర వాహనదారులు ప్రమాదాలకు గురవుతున్నారు. వర్షాకాలంలో లో లెవెల్ బ్రిడ్జి పైనుంచి వరద ప్రవహిస్తుండటంతో రాకపోకలు నిలిచిపోతున్నాయి. ప్రజాప్రతినిధులు, అధికారులు బ్రిడ్జి పట్టించుకోవడంలేదని ప్రజలు పేర్కొంటున్నారు. ఇకనైనా స్పందించి బ్రిడ్జి పనులను వేగవంతం చేయాలని కోరుతున్నారు.

పిల్లర్ దశలో బ్రిడ్జి నిర్మాణం

పనులను వేగవంతం చేస్తాం : ప్రసాద్, స్పెషల్ ఏఈ

నాలుగైదు నెలల్లో బ్రిడ్జి పనులను పూర్తి చేసేందుకు చర్యలు చేపడుతున్నాం. ప్రస్తుతం 50 శాతం పనులు పూర్తయ్యాయి. పిల్లర్ పనులు జరుగుతున్నాయి. మరో మూడు పిల్లర్లు స్లాబ్ పనులు పెండింగులో ఉన్నాయి. వాగులో నీటి ప్రవాహం వల్ల పనుల్లో జాప్యం జరిగింది. వర్షాకాలంలో వరద ప్రభావం వల్ల పనులకు ఆటంకం ఏర్పడే అవకాశం ఉన్నందున ఈ వేసవిలో పనులను వేగవంతం చేశాం.

చౌటుప్పల్‌లో ప్రమాదకరంగా డ్రైనేజీలు

- నాణ్యత లోపంతో పనులు
- పైకప్పులు లేక ప్రమాదాలకు గురవుతున్న వాహనదారులు

పైకప్పు కూలి డ్రైనేజీలో పడ్డ బైక్ (ఫైల్)



డ్రైనేజీ గుంతలోకి దూసుకెళ్లిన కారు (ఫైల్)

చౌటుప్పల్, మార్చి 30 : చౌటుప్పల్ పట్టణంలో సర్వీసు రోడ్లు అంటేనే వాహనదారులు జంకుతున్నారు. అండర్ పాస్ నిర్మాణ పనుల్లో భాగంగా సర్వీస్ రోడ్డు, డ్రైనేజీ పనులు చేపడుతున్నారు. 8నెలలుగా పనులు కొనసాగుతున్నాయి. నాణ్యతా ప్రమాణాలు పాటించకపోవడంతో డ్రైనేజీల పైకప్పులు అక్కడక్కడ ధ్వంసమవుతున్నాయి. దీంతో డ్రైనేజీ పైకి పొరపాటున వాహనాలు ఎక్కితే ఇక అంతే సంగతులు. ఇటీవల ఓ ద్విచక్ర వాహనదారుడు డ్రైనేజీ పైకప్పు కూలి అందులో పడ్డాడు. అతనికి స్వల్ప గాయాలయ్యాయి. గతంలో కూడా ఈ డ్రైనేజీల పైకప్పులు ఎక్కడంతో డీసీఎంలు, ఆటోలు, కార్లు దిగపడ్డ సంఘటనలు అనేకం ఉన్నాయి. డ్రైనేజీ అవతల వ్యాపార సముదాయాలు ఉండటంతో ప్రజలు వస్తువుల కోసం వాహనాలను నిలిపి వెళ్లేందుకు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. దీనికి తోడు కొన్ని చోట్ల డ్రైనేజీ పైకప్పు పనులు కూడా పూర్తి చేయలేదు. దీంతో మురుగు నీరు నిలిచి దుర్వాసన వస్తుంది. కొన్ని చోట్ల డ్రైనేజీ గుంతలు తీసి అలాగే ఉంచడంతో వాహనాలు అందులో పడ్డ సంఘటనలు కూడా ఉన్నాయి. అయినా సంబంధిత అధికారులు చొరవ తీసుకోకపోవడంతో కాంట్రాక్టర్లు ఇష్టానుసారంగా వ్యవహరిస్తున్నారని పలువురు పేర్కొంటున్నారు.